# నేరమూ - నెత్తురు!

బులుసు జే. ప్రకాష్



ఇరవై ఏళ్లకిందట ఈ భూమ్మీదపడ్డ ఉదయగిరి, ఉద్యోగాన్వేషణలో హైదరాబాదు వెళ్లి నెల్లాళ్లయింది. అతని ఉనికి తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ బంధువులందరికీ ఉత్తరాలు రాశారు. "మీవాడు మా ఇంటికి రానేలేదు!" అని ప్రత్యుత్తరాలు వచ్చాయి. ఇహ లాభంలేదని అతని పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు నెగెటివ్‌లు కడిగించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టిచ్చారు. పోలీసులు అతని ఆచూకీకోసం ప్రయత్నిస్తూ టీ.వీ.లద్వారానూ, రేడియోలద్వారానూ, పత్రికల ద్వారానూ ప్రకటనలిచ్చారు. ఫలితం శూన్యం.

ఇంతలో ఒకనాడు వాళ్ల నాన్నగారికి ఒక పోస్ట్‌కార్డు వచ్చింది.

"నాన్నగారూ! మీరెవరూ నా గురించి బెంగపడకండి. నేను క్షేమంగానే ఉన్నాను."

ఏ ఊరునుండి కార్డు రాసిందీ పోస్టల్ ముద్రద్వారా తెలిసింది తప్ప, చిరునామా లేదు. బాధ్యతగల పౌరునిగా ఉదయగిరి తండ్రి ఈ కార్డుని పోలీసులకు అందజేశాడు.

నాటినుండి పోలీసులు ఉదయగిరి ఏ దళంలో చేరి ఉంటాడా అని గాలింపు చర్యలు ప్రారంభించారు. లొంగిపోయిన జీవనప్రవంతిలో చేరిపోయిన తీవ్రవాదుల్ని, ఉగ్రవాదుల్ని సంప్రదించారు. వాళ్లేమీ క్లూ ఇవ్వలేకపోయారు.

యథాప్రకారం బస్సులు దహనం అయిపోతున్నాయి. బస్సు ఛార్జీలు పెరిగిపోతున్నాయి. రైల్వే స్టేషన్లూ, రైళ్లూ పేలిపోతున్నాయి. రైలు ఛార్జీలు పెరిగిపోతున్నాయి.

ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు, ఒకానొక రైల్లో మందీ మార్బలంతో బయలుదేరుతున్నట్లు ప్రసార సాధనాలద్వారా అందరికీ తెలిసింది. బాంబు పెట్టి ఆ రైలుని పేల్చేశారు. కకావికలైయ్యాయి రైలూ, రైలుపట్టాలూ. చాలామంది యమసదనానికి చేరుకున్నారు. ప్రయాణీకుల హాహాకారాలతో, అన్నుల బాంబుకన్నా ఇంకా అధికంగా ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

దేశంలోని వికలాంగుల జాబితాలో మరికొంతమంది చేరారు.

శవాలను గుర్తుపట్టి వారి జాబితాను ప్రచారసాధనాల ద్వారా ప్రకటించారు. బంధువులెవరైనా క్లెయిమ్ చేస్తే ఆ శవాలను అప్పజెప్పాలని ఒక ఆసుపత్రి మార్చురీలో ఉంచారు.

ఉగ్రవాది ఉదయగిరి ఏనాడూ భోరుమని ఏడవకపోయినా, కనీసం చిన్న కన్నీటిబొట్టు కూడా రాల్చలేదు. రైళ్లు పేల్చేసినా, బస్సులు పేల్చేసినా, అందులోని జనం చనిపోయినవారు చనిపోగా, కొన ఊపిరితో ఉన్నవారు హాహాకారాలూ, ఆర్తనాదాలూ చేస్తున్నా, మూలుగుతున్నా ఎప్పుడూ పౌరాణిక చిత్రాలలోని రాక్షసపాత్రధారులు వికటాట్టహాసం చేసినట్లు వికటాట్టహాసం చేయడమే అతనికి తెలుసు.

అటువంటిది ఇవాళ బొటబొటా కన్నీటిబొట్లు రాల్చాడు. కారణం చనిపోయినవారిలో అతని తల్లిదండ్రులున్నారు. అన్నదమ్ములున్నారు. అక్కచెల్లెళ్లున్నారు. వారి ముక్కుపచ్చలారని పసికందులూ ఉన్నారు.

బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్!

వెంటనే చేతిలోని తుపాకీని అడవుల్లోకి విసిరేసి మార్చురీకి వెళ్లి ఆ శవాలమీదపడి భోరుభోరుమని విలపించాడు! ■